క్లుప్తంగా

సామాజిక కళాకారుడు భానుమిత్ర మృతి


భానుమిత్ర (ఫైల్)

చీమకుర్తి: సామాజిక కళాకారుడు సంఘా భానుమిత్ర (57) గుండెపోటుతో ఆదివారం తెల్లవారుజామున మండలంలోని తన స్వగ్రామం పాటిమీద పాలెంలో మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. 1985లో జననాట్యమండలి సభ్యుడిగా సామాజిక కళాకారుడిగా తన జీవితాన్ని ప్రారంభించాడు. రాష్ట్రంలో అగ్రకుల భూస్వామ్య శక్తుల దాడులకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక ఉద్యమాలను బలపరుస్తూ కళారూపాలను ప్రదర్శించి ప్రజలను చైతన్యవంతం చేశాడు. మహాజన పార్టీలో క్రియాశీలక సభ్యుడిగా, అంబేడ్కర్ బౌద్ధమతాన్ని ప్రచారం చేయడం, అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా తన కళారూపాలను ప్రదర్శించడం ద్వారా ప్రజాసంఘాలకు మద్దతుగా నిలిచాడు. కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి దుడ్డు వెంకట్రావు, జిల్లా, మండల నాయకులు, దళిత నాయకుడు నీలం నాగేంద్రం, పలువురు ప్రజా సంఘాల నాయకులు భానుమిత్ర మృతదేహానికి నివాళులర్పించి వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

ఉజ్వల పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ కనెక్షన్

చీమకుర్తి: తెలుపురంగు రేషన్ కార్డు ఉండి ఇప్పటి వరకు ఎలాంటి గ్యాస్ కనెక్షన్ లేని వారికి ఉజ్వల పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ కనెక్షన్ ఇస్తున్నట్లు స్థానిక ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ యజమాని వీవీ రమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్యాస్ కనెక్షన్‌తో పాటు సింగిల్ సిలిండర్ పూర్తిగా నింపిన గ్యాస్‌తో పాటు స్టవ్‌ను కూడా ఉచితంగా ఇవ్వనున్నట్లు చెప్పారు. ఒకవేళ తెలుపురంగు రేషన్ కార్డు లేని వారు రెవెన్యూ అధికారుల ద్వారా బీపీఎల్ (బిలో పావర్టీ లైన్) సర్టిఫికెట్ తెచ్చుకుంటే ఆ సర్టిఫికెట్లో ఉన్న పేర్లు కలిగిన వారెవరికీ గ్యాస్ కనెక్షన్ లేకపోతే ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బంద్ వాల్‌పోస్టర్ విడుదల


వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

ఒంగోలు సెంట్రల్: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నవంబర్ 8వ తేదీ రెవల్యూషనరీ విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యూ) ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు ఈదుపల్లి నాగరాజు తెలిపారు. స్థానిక గీతాంజలి కళాశాలలో ఆదివారం నగర అధ్యక్షుడు పరుచూరి అవినాష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయాలనుకోవడం దుర్మార్గమని అన్నారు. కొత్త పరిశ్రమలు తీసుకురాకపోగా, ఉన్న పరిశ్రమను ప్రైవేటీకరించాలనుకోవడం తగదన్నారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేస్తున్న పోరాటం నవంబర్ 8 నాటికి వెయ్యి రోజులకు చేరుకుంటుందని, ఈ సందర్భంగా అన్ని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థలు బంద్‌లో పాల్గొని సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు. బంద్ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. సంఘ నాయకులు సాయి, వర్షిత్, సుబ్రహ్మణ్యం, సింహాద్రి, తేజ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్ల తొలగింపు


చిల్లచెట్ల తొలగింపును పరిశీలిస్తున్న రవీంద్రరెడ్డి, తదితరులు

కొత్తపట్నం: ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లు పెరిగి మూసుకుపోవడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. స్పందించిన జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి ఆ విషయాన్ని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి ఉచితంగా పొక్లెయిన్ సమకూర్చారు. దానికి డీజిల్‌కి అయ్యే ఖర్చును రవీంద్రరెడ్డి అందజేశారు. సంకువారిగుంట ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి ఈతముక్కల ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లు తొలగించారు. చిల్లచెట్లు ఎక్కువగా పెరగటం వలన ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ఎన్నో ప్రమాదాలు జరిగాయి. రాత్రయితే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించి ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించి పొక్లెయిన్ అందజేసిన ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డికి, ఆళ్ల రవీంద్రరెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. పనులను మాజీ ఎంపీపీ బలగాని శ్రీనివాసరావు, గ్రామ సచివాలయ కన్వీనర్ చెక్కా సురేంద్ర, తానికొండ కొండలరావు, మండల సోషల్ మీడియా కో కన్వీనర్ స్వర్ణ సుబ్బారావు, ఆర్.కోటేశ్వరరావు పర్యవేక్షించారు.

స్కేటింగ్‌లో విద్యార్థుల ప్రతిభ


గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించిన చిన్నారులు


ఓవరాల్ చాంపియన్‌షిప్ ద్వితీయ స్థానంలో నిలిచిన శిద్దా ఆరాధ్య

ఒంగోలు సెంట్రల్: స్థానిక శ్రీ హర్షిణి జూనియర్ కళాశాలలో ఏఎం స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు స్కేటింగ్ పోటీలు నిర్వహించారు. ఇండియన్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. విద్యార్థులు ఇషాన్, ఆర్యనందన్, మను రేష్యంత్, శ్రద్ధ, ధ్రిష్ గోల్డ్ మెడల్ సాధించారు. బి.అభినందన్, సంతోష్‌రెడ్డి సిల్వర్ మెడల్స్ సాధించారు. వీరు ఏఎం స్పోర్ట్స్ ఫెడరేషన్ నుంచి ఎస్‌జీఎఫ్‌కు ఎంపికైనట్లు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను స్కూల్ యాజమాన్యం కాపా చిరంజీవి, ఘాన్సీ అభినందించారు.

ఓవరాల్ చాంపియన్‌షిప్ ద్వితీయ స్థానం సాధించిన శిద్దా ఆరాధ్య...

ఒంగోలు: తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యుడు శిద్దా సుధీర్‌కుమార్ కుమార్తె శిద్దా ఆరాధ్య స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ చూపి ఓవరాల్ చాంపియన్‌షిప్ ద్వితీయ స్థానంలో నిలిచింది. ఇండియా అమెచ్యూర్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏడుగుండ్లపాడు శ్రీహర్షిణీ జూనియర్ కాలేజీ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఈ పోటీల్లో సత్తా చాటింది. కాగా, శిద్దా సుధీర్ కుమారుడు శిద్దా ధ్రిష్ కూడా సబ్ జూనియర్ విభాగంలో విజేతగా నిలిచాడు. వీరిద్దరికీ నిర్వాహకులు మెమెంటోలు అందించి అభినందించారు.

చిత్రలేఖన పోటీలకు విశేష స్పందన


చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఒంగోలు మెట్రో: మెగా పోర్ట్రైట్ పెయింటింగ్లో పదహారేళ్ల వయసు పైబడి అర్హత కలిగిన చిత్రకారులకు స్థానిక అంబేడ్కర్ భవనంలో ఆదివారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వందమంది కళాకారులు పాల్గొన్నారు. గెలుపొందిన చిత్రకారులతో పాటు పాల్గొన్న వారికి సర్టిఫికెట్, షీల్డ్ ప్రదానం చేసి శాలువాతో సన్మానించారు.

సెపక్‌తక్రా పోటీలకు నలుగురు ఎంపిక


పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

ఒంగోలు: జాతీయ స్థాయి సెపక్ తక్రా పోటీలకు జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారని సెపక్ తక్రా సంఘ జిల్లా చైర్మన్ డాక్టర్ కృష్ణసాయి, సెక్రటరీ డి.రవిప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన ఎస్.మధు, జె.జాకబ్, ఐ.నాగార్జున, ఎం.మధులత గోవాలో ఈనెల 30 నుంచి నవంబర్ 3వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో సత్తా చాటాలని అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులతో పాటు కోచ్ బి.శ్రీనివాస్ ఆకాంక్షించారు.

శోభాయాత్ర కరపత్రాల ఆవిష్కరణ


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: నరసింహస్వామి భక్త బృందం ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలో మొట్టమొదటిసారిగా సింహాచలం దేవస్థానం వారిచే శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి శోభాయాత్ర, సుదర్శన నరసింహ హవనం కళ్యాణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఒంగోలు మినీస్టేడియం వద్ద గల బాలాజీ తిరుపతిరావు కళ్యాణ మండపంలో ఆదివారం పాత్రికేయుల సమావేశంలో నిర్వహించి మాట్లాడారు. నవంబర్ 4వ తేదీ శనివారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి స్థానిక చెన్నకేశవస్వామి గుడి నుంచి వరాహ లక్ష్మీనృసింహస్వామి శోభాయాత్రను సింహాచలం దేవస్థానం వారి పర్యవేక్షణలో నగరంలోని ప్రధాన వీధుల మీదుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 5వ తేదీ ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు సుదర్శన నరసింహ కళ్యాణోత్సవాన్ని సింహాచలం దేవస్థాన వేద పురోహితులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చక్కా ప్రసాదు, నల్లమల్లి బాలు, అన్నం శ్రీనివాసులు, వేముల కోటిలింగం గుప్తా, గుర్రం బదరీనారాయణ, లలూ బద్రీనాథ్, కమలాకర్, కోడూరి కిషోర్, కొమ్మిశెట్టి రంగ, మీరావలి, రాము, పద్మనాభుని నందకుమార్, బాలసుబ్రహ్మణ్యం, చక్కా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

అద్దంకి రూరల్: ముందు వెళ్తున్న లారీని వెనుక వస్తున్న బైకు ఢీకొట్టటంతో యువకుడికి గాయాలయ్యాయి. ఈఘటన అద్దంకి పట్టణ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. మండలంలోని శింగరకొండపాలెం గ్రామానికి చెందిన పాలపర్తి మహేష్ బైక్ మీద మేదరమెట్ల నుంచి అద్దంకికి వస్తున్నాడు. ఈక్రమంలో మేదరమెట్ల- నార్కెట్‌పల్లి నామ్ రహదారిపై పట్టణ శివారులోని దాల్ మిల్లు వద్దకు రాగానే నెల్లూరు నుంచి మాచర్ల వెళ్తున్న లారీ వెనుక భాగంలో ఢీకొట్టాడు. ఈఘటనలో మహేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం ఒంగోలు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

నాగవరపమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో నాగవరపమ్మ అమ్మవారు


ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్న భక్తులు

వేటపాలెం: రామన్నపేట శివారులో పంట పొలాల్లో వేంచేసియున్న భక్తులు కోరిన కోర్కెలు తీర్చే దేవతగా పేరొందిన కనక నాగవరపమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దర్శనానికి భక్తుల రాకతో ఆలయం పరిసరాలు కిటకిటలాడాయి. దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు బారులు తీరారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వందల సంఖ్యలో ఆలయానికి ఊరేగింపుగా చేరుకున్న భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించుకొని అమ్మవారి చెల్లించి మొక్కులు తీర్చుకొన్నారు. ఆలయ ఈవో జీవీఎల్ కుమార్, భక్తులు ప్రసాదాల పంపిణీ చేశారు.

ఖోఖో క్రీడాకారులకు అభినందన


క్రీడాకారులతో అనిల్ రావిపూడి, శ్రీలీల

జే.పంగులూరు: స్థానిక పంగులూరు మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణ జూనియర్ కళాశాలలో గత ఐదు నెలలుగా రాష్ట్ర ఖోఖో జట్టుకు ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో ఖోఖో శిక్షణ జరుగుతోంది. ఈ జట్టు గోవాలో జరగబోయే జాతీయ క్రీడల్లో పాల్గొననుంది. శిక్షణ శిబిరం తుదిదశకు చేరుకున్న సందర్భంగా శనివారం రాత్రి రాష్ట్ర ఖోఖో జట్టును సినీ దర్శకుడు అనిల్ రావిపూడి, హీరోయిన్ శ్రీలీల వారని అభినందించారు. అనీల్ రావిపూడి అమమ్మది జనకవరం, శ్రీలీల సొంత ఊరు పంగులూరు వచ్చిన సందర్భంగా పంగులూరులో జరుగుతున్న ఖోఖో శిక్షణ శిబిరం సందర్శించి, క్రీడాకారులను ప్రతి ఒక్కరిని పలకరించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చైర్మన్ బాచిన చెంచు ప్రసాద్, రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి, ఇండియన్ రైల్వే ఖోఖో శిక్షకుడు బ్రహ్మనాయుడు, శాప్ ఖోఖో శిక్షకుడు, అంతర్జాతీయ క్రీడాకారుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాం


గుంటక సుబ్బారెడ్డి, బ్రహ్మంను అభినందిస్తున్న బద్రీనాథ్ తదితరులు

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలో 125 వసంతాలు పూర్తి చేసుకుంటున్న కొప్పరపు వెంకటకృష్ణ కళానిలయం అభివృద్ధికి కృషి చేయడంతోపాటు కళాకారులకు చేయూతనిస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని కార్యదర్శిగా మూడోసారి ఎన్నికైన మార్కెట్ యార్డు మాజీ కార్యదర్శి గుంటక సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రీడింగ్ రూమ్ ఆవరణలో సర్వసభ్య సమావేశం, నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. తనను మూడోసారి ఎన్నుకున్నందుకు సుబ్బారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అధ్యక్షులు డాక్టర్ బాల సుబ్బారావు మాట్లాడుతూ రీడింగ్ నిలయం అభివృద్ధికి ఎమ్మెల్యే కెపి నాగార్జునరెడ్డి సహకారం మర్చిపోలేమని, అలాగే ఉపాధ్యక్షులుగా ఎన్నికైన శాసనాల వీరబ్రహ్మం, ఆడిటర్ తోట సత్యనారాయణ, షెక్షావలి, ఇంకా పలువురు ప్రముఖులు కృషి చేశారన్నారు. కోశాధికారిగా పి.మల్లిఖార్జునరావును, జాయింట్ సెక్రటరీగా ఎం.రామ్మోహన్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గుంటక సుబ్బారెడ్డి, శాసనాల బ్రహ్మం, బాల సుబ్బారావును రాష్ట్ర ఎమ్ఎస్ఎమ్ఈ కార్పొరేషన్ డైరెక్టర్ మేడా వెంకట బద్రీనాథ్, వైఎస్సార్ సీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి బొగ్గరపు శేషయ్య, అంతర్జాతీయ ఆర్యవైశ్య సంఘ సెక్రటరీ చాటకొండ నాగరాజు, గుంటూరు రైల్వే డివిజన్ మెంబరు ఆర్‌కేజే నరసింహం, ఐడియల్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రమేష్, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ముత్తారెడ్డి వెంకటరెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్తలు నాగేళ్ల వెంకటేశ్వర్లు, కందెపు రంగయ్య, మధు తదితరులు సన్మానించారు. ఎన్నికల అధికారులుగా డేవిడ్‌స్టోన్, సీహెచ్ మల్లికార్జునరావు వ్యవహరించారు.

వైఎస్సార్ సీపీ నాయకులకు ప్రణీత్‌రెడ్డి నివాళులు


మారెళ్ల శ్రీనివాసరావు భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి, నాయకులు

ఒంగోలు: ఆకస్మికంగా అనారోగ్యంతో మృతిచెందిన వైఎస్సార్ సీపీ నాయకుల భౌతిక కాయాలకు ఆదివారం ఉదయం పార్టీ యువ నాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి నివాళులర్పించారు. ఏపీ రజక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీనివాసరావు అలియాస్ పాల శ్రీను బ్రెయిన్ స్ట్రోక్‌తో శనివారం సాయంత్రం గుంటూరు జనరల్ హాస్పిటల్‌లో మృతిచెందిన విషయం తెలిసిందే. బాలినేని ప్రణీత్‌రెడ్డి ఆదివారం వారింటికి చేరుకుని మారెళ్ల శ్రీనివాసరావు భౌతిక కాయంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. అనంతరం మారెళ్ల శ్రీనివాసరావు సతీమణి, ఏపీ రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ మారెళ్ల శ్రీదేవిని, వారి పిల్లలను పరామర్శించారు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. రజకుల సమస్యల పరిష్కారానికి మారెళ్ల శ్రీనివాసరావు చేసిన కృషిని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, నగర నాయకుడు కటారి శంకర్, ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి, విశ్వబ్రాహ్మణ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి సుతారం శ్రీనివాసులు, కృష్ణ బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ తిర్లిక శ్రీనివాసులు, రజక సంఘ రాష్ట్ర, జిల్లా నాయకులు ఉన్నారు.

జిల్లా రజక వృత్తిదారుల సంఘం సంతాపం...

ఒంగోలు టౌన్: మారెళ్ల శ్రీనివాసరావు మృతికి ప్రకాశం జిల్లా రజక వృత్తిదారుల సంఘం సంతాపం ప్రకటించింది. సంఘ జిల్లా అధ్యక్షుడు టంగుటూరు రాము, కార్యదర్శి రాయల కొండయ్య, సహాయ కార్యదర్శి మంచికలపాటి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు డాక్టర్ కృష్ణయ్య, కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు పి.పోలయ్య, చెన్నుపల్లి సింగయ్య, కల్లగుంట సుబ్బారావు, న్యాయవాది మల్లికార్జున, మార్టూరు వెంకటేశ్వర్లు ఆదివారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

చింతాయగారిపాలెంలో...

ఒంగోలు రూరల్: మండలంలోని చింతాయగారిపాలెంలో వైఎస్సార్‌సీపీనాయకుడు పనమల అర్జునరావు (65) సముద్రంలో చేపల వేటకు వెళ్లి గుండెపోటుతో మరణించిన విషయం తెలుసుకున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి ఆదివారం ఉదయం వారి నివాసానికి చేరుకుని నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి, ఒంగోలు ఎంపీడీవో పి.అజిత, తహసీల్దార్ పి.మురళి, చింతాయగారిపాలెం సర్పంచ్ నాయుడు శ్రీరాములు, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

నల్ల రిబ్బన్లతో పీటీడీ ఈయూ నిరసన


ఒంగోలులో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న పీటీడీ ఈయూ నాయకులు

ఒంగోలు: కావలి వద్ద ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌పై దాడిచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్ ఎంప్లాయీస్ యూనియన్ (పీటీడీ ఈయూ) రాష్ట్ర చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కె.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం స్థానిక ఆర్టీసీ డిపోలో ఈయూ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన వ్యక్తం చేశారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆన్‌డ్యూటీ డ్రైవర్ రాంసింగ్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జోనల్ అధ్యక్షుడు వాకా రమేష్, జోనల్ జాయింట్ సెక్రటరీ బెజవాడ రవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి అమానుషం...

చీమకుర్తి: కావలి వద్ద ఆర్టీసీ డ్రైవర్‌పై స్థానికులు చేసిన దాడి అమానుషమని చీమకుర్తి, ఒంగోలు ఆర్టీసీ కార్మిక పరిషత్ నాయకులు జీఆర్‌బీ ముఖర్జీ, సీహెచ్ వెంకటేశ్వర్లు ఖండించారు. దాడిని ఖండిస్తూ ఆదివారం చీమకుర్తిలో ప్రకటన విడుదల చేశారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా ప్రభుత్వం అండగా నిలవాలన్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ


దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందిస్తున్న సంపత్

చీమకుర్తి: సేవాసంకల్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇద్దరు దివ్యాంగులకు పాతూరి సంపత్ రెండు ట్రైసైకిళ్లను ఆదివారం సంతనూతలపాడులో పంపిణీ చేశారు. సంపత్ తండ్రి గోవిందయ్య జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరంలో పదో తరగతిలో మంచి మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచే విద్యార్థులకు నగదు బహుమతులు ఇస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో సేవా సంకల్ప ట్రస్ట్ అధ్యక్షుడు వెంకటరమణ, పాల్గొన్నారు.

కలశ కుండలతో ఢిల్లీ బయలుదేరిన బీజేపీ శ్రేణులు


ఢిల్లీ వెళ్తున్న బీజేపీ నాయకులు

ఒంగోలు సెంట్రల్: మేరా దేశ్ మేరా మట్టి కార్యక్రమంలో భాగంగా బీజేపీ శ్రేణులు కలశ కుండలతో ఆదివారం ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి ఆధ్వర్యంలో 50 మంది కార్యకర్తలు ఢిల్లీ తరలివెళ్లారు. ముందుగా విజయవాడ చేరుకుని అక్కడ పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా రైల్వేస్టేషన్‌కు చేరుకుని అమృత కలశ యాత్ర ప్రత్యేక రైలులో ఢిల్లీ వెళ్తున్నట్లు వారు తెలిపారు.